క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 11, వంకాయ 18, బెండ 28, పచ్చిమిర్చి 28, కాకర 23, బీర 23, క్యాబేజీ 11, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 33, దొండ 18, చిక్కుడు 45, గోకర 28, బీట్‌రూట్ 19, క్యాప్సికం 33, ఆలు 23, దోస 13, సొర 11, పొట్ల 11, ఉల్లిగడ్డ 27, చామగడ్డ 35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మహావిష్ణుకు కెమిస్ట్రీలో డాక్టరేట్



నాగోలు: శ్రీచైతన్య కళాశాల నాగోల్ బ్రాంచ్‌లో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పని చేస్తున్న సుద్దికట్టు మహావిష్ణు అమెరికాలోని మౌంట్ ఎల్బర్ట్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి రసాయన శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. రెండు రోజుల క్రితం అమెరికాలో జరిగిన ఓ కార్యక్రమంలో డాక్టర్ పట్టాను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మహావిష్ణు మాట్లాడుతూ, ప్రతిష్టాత్మకమైన మౌంట్ ఎల్బర్ట్ వర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకోవడం చాలా గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. డాక్టరేట్ అందుకున్న ఆయనను తోటి అధ్యాపకులు, కుటుంబసభ్యులు అభినందించారు.

సీనియర్లకు బీజేపీ టికెట్ కేటాయించాలి

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గం నుంచి టికెట్ కేటాయించాలని అక్బర్‌బాగ్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ మాజీ కన్వీనర్, సీనియర్ నేత బి.నర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంజరి వినోద్‌కుమార్ ఆదివారం నగరంలోని కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి వేర్వేరుగా దరఖాస్తు చేసుకున్నట్లు సోమవారం తెలిపారు. సీనియర్లకు అవకాశం కల్పిస్తే పార్టీకి విజయావకాశాలు ఉంటాయన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



జెడ్సీకి వినతిపత్రం సమర్పిస్తున్న ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజకు వినతిపత్రం సమర్పించారు. అలాగే గణేష్ ఉత్సవాలకు చేపట్టాల్సిన స్ట్రీట్‌లైట్లు, రోడ్డు మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. వర్షాల వల్ల పాడైన రోడ్లను బ్లాక్‌టాప్‌తో కొత్త రోడ్డు వేయాలని కోరారు. వైభవ్ టిఫిన్ సెంటర్ వద్ద స్టాం వాటర్ నాలా పునరుద్ధరణ పనులకు రూ. 90 లక్షలతో టెండర్ పిలిచారని, పనులు పూర్తి కాకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జోనల్ కమిషనర్‌కు తెలియజేశారు.

ధ్యానాంజనేయ ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న భక్తులు, పాలక మండలి సభ్యులు

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లోని శ్రీధ్యానాంజనేయ స్వామి ప్రధాన ఆలయంతో పాటు ఉప ఆలయాల హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. స్వామివారికి భక్తులు కానుకలు, ముడుపుల రూపంలో రూ. 31 లక్షల 54 వేలు, అమెరికన్ డాలర్లు 100, బ్రిటన్ పౌండ్స్ 10 హుండీలో వేశారని ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

13న స్పటిక శివలింగం వద్ద ప్రత్యేక పూజలు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మంగారి ఆలయంలో ప్రతిష్టించిన స్పటిక శివలింగం వద్ద ఈ నెల 13న మాస శివరాత్రి సందర్భంగా మహా మృత్యుంజయ హోమం, లక్ష బిల్వార్చన పూజలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ అశోక్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొనాలని వారు కోరారు.

జాతీయ రహదారులపై అక్రమ పార్కింగ్

పార్కింగ్ సదుపాయం లేని హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు


చింతలకుంటలోని ఓ హోటల్ ముందు ఇదీ పరిస్థితి


వనస్థలిపురం పనామ దగ్గర..

- విజయవాడ, నాగార్జున సాగర్ రోడ్లపై నిత్యం స్తంభిస్తున్న ట్రాఫిక్
- వాహనదారులకు జరిమానాలు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- వ్యాపార సముదాయాలకు నోటీసులతోనే సరి

హస్తినాపురం: విజయవాడ, నాగార్జున సాగర్ జాతీయ రహదారులపై వాహనాల అక్రమ పార్కింగ్‌లతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. హోటళ్లు, వ్యాపార సముదాయాల ముందు ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ స్తంభించి ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోందని వాహనదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

- విజయవాడ జాతీయ రహదారిపై అబ్దుల్లాపూర్ మెట్టు నుంచి మొదలుకొని పెద్దఅంబర్‌పేట, హయత్‌నగర్ డిపో ముందు రోడ్డుకు ఇరువైపులా వైన్‌షాపుల ముందు రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు.
- ఆటోనగర్ ఇసుకలారీ పార్కింగ్ దగ్గర వందలాది లారీలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. సుష్మా దగ్గర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు, ఆసుపత్రి, వైన్‌షాపు ముందు, ఓ హోటల్ ముందు, చింతల్‌కుంటలోని రెండు ప్రముఖహోటళ్ల ముందు వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- వనస్థలిపురంలోని ఓ సూపర్ మార్కెట్ ముందు పార్కు చేసిన వినియోగదారుల వాహనదారులకు రూ.300 నుంచి 500 వరకూ జరిమానాలు విధిస్తున్న అధికారులు.. పార్కింగ్ సదుపాయం కల్పించని సదరు సంస్థకు మాత్రం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు.
- ఇప్పటికైనా వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు వ్యాపార సముదాయాల ముందు రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేసే వాహనదారులకు కాకుండా.. పార్కింగ్ సదుపాయం కల్పించని వ్యాపార సముదాయాలకు జరిమానాలు విధించడం లేదా వాటిని సీజ్ చేయడం వంటివి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

> **రోడ్లపై వాహనాలను నిలిపితే సహించం**
>
> 
>
> వనస్థలిపురం పరిసర ప్రాంతాలలో విజయవాడ, సాగర్ జాతీయ రహదారులపై ఉన్న వ్యాపారముదాయాల ముందు అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తే సహించం. వ్యాపార సముదాయాల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. వాటి ముందు రోడ్లపై పార్కింగ్ చేసిన వారికి జరిమానాలు విధించాం. వ్యాపార సముదాయాలకు నోటీసులు జారీచేసినా వారిలో మార్పు రాకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుని, అవసరమైతే వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తాం.
>
> – ఎల్.బాలు చౌహాన్, వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ

అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు


సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఫణిగిరి వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఏర్పాటైన కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను కాలనీ అధ్యక్షుడు బాశెట్టి అజయ్‌కుమార్ ఎమ్మెల్యేకు వివరించారు. సమదృష్టితో అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఏ సమస్య ఉన్నా.. తన దృష్టికి వస్తే పరిష్కారమయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ సెక్రటరీ నరేందర్ రెడ్డి, కోశాధికారి రవికుమార్, ఉపాధ్యక్షుడు స్వామి, వెంకటాచారి, నర్సింహారెడ్డి, జాయింట్ సెక్రటరీలు అంజయ్య, శ్రీనివాస్‌యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాగ్ భూషణ్‌సింగ్, గౌరి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పండగల వేళ అధికారుల సమన్వయం అవసరం: డీసీపీ


ప్రభుత్వశాఖల అధికారులతో సమావేశమైన డీసీపీ రూపేష్

సైదాబాద్: పండగల సమయాల్లో అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయం అవసరమని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్ రూపేష్ అన్నారు. సోమవారం సైదాబాద్‌లోని డీసీపీ కార్యాలయంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, పోలీస్ అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండగలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా అన్ని శాఖలు సహకరించుకోవాలన్నారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా నిమజ్జనానికి వెళ్లే వాహనాలకు ఆటంకాలు ఎదురుకాకుండా రహదారులపై గుంతలను వెంటనే పూడ్చి వేయాలన్నారు. రహదారులపై అవసరమున్న చోట ప్యాచ్‌వర్క్ మరమ్మతు పనులు చేయాలన్నారు. విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు తీసి వేయాలన్నారు. మతపరమైన కట్టడాలపై కవర్లు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్, ఇన్‌స్పెక్టర్ రవి మొలుగూరి, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, ఎస్‌సీ, జీహెచ్ఎంసీ అధికారులు, ఆర్ అండ్ బీ, రెవెన్యూ, విద్యుత్, ఆర్‌టీసీ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు


సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

హస్తినాపురం: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్ని పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎల్బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ భూపేశ్ గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, హనుమాన్‌నగర్ టెంపుల్ డైరెక్టర్ నారగోని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నల్లపోచమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ నుంచి 200 మంది బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు సాధించుకున్న తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సత్యంచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌రెడ్డి, బీజేపీ నుంచి పార్టీలో చేరినవారిలో కందకట్ల శివకుమార్‌రెడ్డి, పెండ్యాల మధుసాగర్, వాకిటి సుధాకర్‌రెడ్డితో పాటు రెండు వందల మంది చేరారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తాం

మలక్‌పేట ఎమ్మెల్యే బలాల


లబ్ధిదారుకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహాలోని కార్యాలయంలో సోమవారం అంబర్‌పేట మండల పరిధిలోని కమల్‌నగర్, అజంపుర, ఆనంద్‌నగర్, రసూల్‌పుర, కాలాడేరాకాలనీ, దయానంద్‌నగర్, అక్బర్‌బాగ్, పద్మానగర్, శంకర్‌నగర్, వాహేద్‌నగర్, పాపయ్యబస్తీ, ప్రిన్స్ బాడిగార్డ్ లైన్, ఓల్డ్‌మలక్‌పేట ప్రాంతాలకు చెందిన 100 మందికి షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి 10 మందికి మొత్తం 110 మంది లబ్ధిదారులకు రూ.1,10,12,760 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, మజ్లిస్ పార్టీ నాయకులు ఉన్నారు.

డివిజన్ అభివృద్ధిలో రాజీపడం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: డివిజన్‌ను అభివృద్ధి చేయడంలో రాజీపడే ప్రసక్తి లేదని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సాయిరామ్ అపార్ట్‌మెంట్ వద్ద నిర్మించనున్న రోడ్డు పనులు కార్పొరేటర్ సోమవారం ప్రారంభించారు. శాలివాహననగర్‌లో రోడ్డు నిర్మాణం, నాలా స్లాబ్ పనులు, రామాలయం, బ్యాండ్ బస్తీలలో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. గణేష్ ఉత్సవాలు నేపథ్యంలో రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వై. సురేందర్, రంజిత్‌కుమార్, వెంకట్‌రెడ్డి, పరుశ్‌రామ్, సందీప్, వినోద్ దినేష్ పాల్గొన్నారు.

స్టాలిన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి: బీజేపీ


ఐఎస్‌సదన్ చౌరస్తాలో స్టాలిన్ చిత్రపటాలను దహనం చేస్తున్న మధుకర్‌రెడ్డి తదితరులు

సైదాబాద్: సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్టాలిన్ వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటాన్ని సోమవారం ఐఎస్‌సదన్ చౌరస్తాలో బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ, మంత్రి స్థాయిలో ఉండి స్టాలిన్ సనాతన ధర్మాన్ని డెంగీ, మలేరియాతో పోల్చడం సరికాదన్నారు. తమిళనాడు మంత్రివర్గం నుంచి ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అజయ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, సందీప్, సాయి పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని రక్షించుకోవాలి: సామ


ఎల్బీనగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు

మన్సూరాబాద్: సనాతన ధర్మం భారతీయ జీవన విధానమని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. హిందు ధర్మాన్ని ఉద్దేశించి విద్వేష పూరిత వాఖ్యలు చేసిన తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను శిక్షించాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం ఎల్బీనగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. చింతలకుంటలోని చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి మాట్లాడుతూ, సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తన కుమారుడు ఉదయనిధి చేసిన వ్యాఖ్యలను తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సమర్థించడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విచ్ఛిన్నకర శక్తులకు హిందూ సమాజం తగిన సమయంలో బుద్ధి చెప్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, చింతల అరుణ, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరణిలో వక్ఫ్ భూమి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

హయత్‌నగర్: హయత్‌నగర్ అన్మగల్‌లోని సర్వే నంబర్ 88, 89, 147లోని 3.37 ఎకరాల వక్ఫ్ బోర్డు భూమిని కొందరు ఆక్రమించి ధరణిలో తమ భూమిగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఈ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరుతూ టీపీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్‌యాదవ్ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ భూమిపై గతంలో తాను చేసిన ఫిర్యాదుతో స్పందించిన వక్ఫ్ బోర్డు ఈ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కలెక్టర్‌కు లెటర్ రాసిందని ఆయన తెలిపారు. వినతి పత్రంతో ఆ లెటర్‌ను జత చేశామని ఆయన తెలిపారు.

మిర్చి రైతులకు ఆన్‌లైన్‌లోనే డబ్బులు చెల్లించాలి

చాదర్‌ఘాట్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నామ్ అమలు చేస్తున్న వ్యవసాయ మార్కెట్లలో మిర్చి రైతులకు ఆన్‌లైన్‌లోనే డబ్బులు చెల్లించాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్ అన్నారు. సోమవారం అధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మిర్చి వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఇక నుంచి మిర్చి రైతులకు ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు తప్పకుండా పాటించాల్సిందేనని ఆమె వ్యాపారులతో అన్నారు. అయితే, ఆన్‌లైన్ చెల్లింపుల వల్ల రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయని వ్యాపారులు చైర్‌పర్సన్‌కు తెలిపారు. ఎస్‌ఈఎస్ దామోదర్, మిర్చి వ్యాపారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇవ్వాలి: అందెల


దిల్‌సుఖ్‌నగర్: మన కష్టాలు తీరాలంటే బీజేపీ రావాలి, బీఆర్ఎస్‌కు ప్రజలు వీఆర్ఎస్ ఇవ్వాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా 5రోజు సోమవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని అల్కాపురి, యాదవ్‌నగర్ కాలనీల్లో అందెల శ్రీరాములు, ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ముంతా రాములు, సిద్దూ ముదిరాజ్ సహా బీజేపీ, బీజేవైఎం, మహిళా మోర్చా నాయకురాళ్లు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించండి



నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని భూగర్భ డ్రైనేజీలు, తాగునీటి సమస్యలను తొందరగా పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆమె సోమవారం జలమండలి కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు కేశిరెడ్డి పద్మారెడ్డి, డప్పు రాజు, మైనం రాజేశ్వర్, రావుల శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో జైల్ వార్డర్ మృతి


జ్యోతిలాల్ (ఫైల్)

చంచల్‌గూడ: గుండె పోటుతో జైల్ వార్డర్ మృతి చెందాడు. వివరాలు...చంచల్‌గూడ పురుషుల జైల్లో కొన్నేళ్లుగా వార్డర్‌గా పని చేస్తున్న జ్యోతిలాల్‌కు సోమవారం ఉదయం తన నివాసంలో ఉండగా గుండె పోటు రావడంతో స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు అతడ్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జ్యోతిలాల్ మృతికి జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

గణేష్ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి: ఏసీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకన్న నాయక్

సైదాబాద్: గణేష్ నవరాత్రి వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్ అన్నారు. సైదాబాద్ ఠాణా పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో సోమవారం సైదాబాద్-సరూర్‌నగర్ రహదారిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా అన్నిరకాల రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలన్నారు. మండపంలో రాత్రి సమయంలో ముగ్గురు బస చేయాలని, నిమజ్జన ఊరేగింపులో కర్రలు, కత్తులు, మారణాయుధాలు ధరించరాదని అన్నారు. ఊరేగింపులో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలను అనుమతించమని స్పష్టం చేశారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. సమావేశంలో సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రవి మొలుగూరి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విఫలం: జక్కిడి


హస్తినాపురంలో పాదయాత్ర చేస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

హస్తినాపురం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాలనలో హస్తినాపురం డివిజన్ అధ్వానంగా తయారైందని, ఎక్కడ చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయని ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. 4వ రోజు ప్రజాచైతన్య యాత్రను సోమవారం ఆయన అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డితో కలిసి షిర్డీసాయినగర్, డీఆర్‌డీఎల్ కాలనీ, అగ్రికల్చర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, ఇంద్రప్రస్థ కాలనీ, బాలాజీనగర్, భూపేశ్‌గుప్తానగర్‌కాలనీ మీదుగా నందనవనం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, వరద ముంపు వల్ల హస్తినాపురంలోని పలు కాలనీల ప్రజలు అవస్థలు పడతున్నా పట్టించుకునేవారే కరువయ్యారన్నారు. డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు అసలైన లబ్ధిదారులకు కాకుండా ఎమ్మెల్యే అనుచరులకు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహ, సతీష్‌గౌడ్, మహేశ్, సాకీర్, బ్రహ్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, సాయిరాంరెడ్డి పాల్గొన్నారు.

రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి: సీపీఐ



చింతలకుంటలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

వనస్థలిపురం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురం పనామా చౌరస్తా నుంచి చింతలకుంట చాకలి ఐలమ్మ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరగడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజ్ రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టుల ప్రాణ త్యాగం వల్ల తెలంగాణ ప్రాంతానికి రజాకార్ల నుంచి విముక్తి లభించిందన్నారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ వారోత్సవాలను అధికారికంగా నిర్వహించకుండా మూర్ఖంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 10 నుంచి 17 వరకు వారోత్సవాలను సీపీఐ నిర్వహిస్తోందని, అందులో భాగంగా ర్యాలీ నిర్వహిస్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. పార్టీ ఎల్బీనగర్ కన్వీనర్ సామిడి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌గౌడ్, కృష్ణ, సుధాకర్, ఇమ్రాన్, రాములుగౌడ్, అరుణ్‌కుమార్‌గౌడ్, సక్రునాయక్, సుభద్ర, సరిత, శ్రీదేవి, కల్యాణి, సుజాత, దీపిక పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

వనస్థలిపురం: భారీ విగ్రహాలు, హంగులు, ఆర్భాటాలకు పోకుండా పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి సూచించారు. వనస్థలిపురం రామాలయం ప్రాంగణంలో జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన మట్టి గణపతి విగ్రహాలను సోమవారం ఆయన సందర్శించారు. పర్యావరణ పరిరక్షణకు దశాబ్ద కాలంగా పాటుపడుతున్న జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, సంఘం సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రమణ, రామాంజనేయులు, వెంకటేష్, రామలింగేశ్వర్‌రావు, జైపాల్‌రెడ్డి, ఓబులేష్, భద్రారెడ్డి పాల్గొన్నారు.


వనస్థలిపురంలో మట్టి గణపతి విగ్రహం వద్ద ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి తదితరులు